# అడవిమల్లె

కొసాల నాగభూషణం

"ఆశ్చర్యంగా వుందీ సుశీల నీకు వుత్తరం రాసిన సంగతి తల్చుకుంటే...."

"ఏం? ఎందుకని?"

"అంత ముభావం మనిషి కనీసం పలకరించేది కాదు—తెలిసిన వాళ్లెదురైనా"

"నీకెల్లా తెలుసు ఆమెని గురించి—నాకు తెలియక?"

"దగ్గరే వాళ్ళ వూరు మా వూరికి. అయినా వివరాలేం తెలియవు ఇక మీదే తెలుసుకోవాలి నీకోసం" అంటూనే వున్నాడు వాడు—మా ఫ్రెండ్ సుబ్బారావు—అప్పుడే హారన్ ఇస్తూ దూసుకు రాసాగింది ఎక్స్‌ప్రెస్ బస్సు.

ఒక మోస్తరు పల్లెటూరే అయినా మెయిన్ రోడ్డులోనే వుండడంవల్ల చెయ్యి చాపితే చాలు ఆగుతాయి ఎక్స్‌ప్రెస్ బళ్లు మా వూళ్లో. ప్రయాణాల కష్టే ఇబ్బంది పడక్కర్లేదు మేము.

బస్సు ఆగింది మావాడికోసమే అన్నట్టు. క్షణాల్లో వురకేసు వీడు కదిలింది బస్సు. మెరుపులా దూసుకుని వెళ్ళింది.

సుబ్బారావు నాలుగేళ్ల కాలేజీ జీవితాన్ని ఖర్చుచేసి నేను సంపాయించుకున్న మంచిమిత్రులు నలుగురైదుగురిలో ఒకడు. నా కత్యంత సన్నిహితుడు.

వాడికి పెళ్ళికాకముందెప్పుడో వొచ్చేడు మా ఇంటికి ఆపైన పెళ్ళయి ఒక బిడ్డకి తండ్రికూడా అయ్యేడుగాని ఆ మధ్యలో మా ఇంటి కెప్పుడూ రాలేదు వాడు. సతీసమేతంగా వొచ్చి మా ఇంటిని పావనం చెయ్యరా బాబూ! అని ఎన్నిమార్లు చెప్పినా, వుత్తరాలు రాసినా "ఏది క్షణం తీరికలేదు. అయినా సంసారి బాధలు నీకేం తెలుస్తాయి—సన్యాసి వెధవ్వి" అనేవాడు.

ఇప్పుడు ఏదో బిజినెస్ పనిమీద మద్రాసు వెళుతూ నన్ను చూసి చాలా రోజులే అయిందనే చెడ్డ జ్ఞాపకం ఒకటి ఏడ్చినందువల్ల దిగేడుట ఇక్కడ నిన్న. మరి ఈ వుదయానికల్లా వుచ్చులు వూడదీసుకుని వురికేసేడు.

అయితేనేం? ప్రత్యేకం నా కోసం అని బయలు దేరకున్నా, గమ్యానికి మార్గ మధ్యంలోనే నన్ను కలుసుకున్నా "ఆప్త మిత్రుడు నాకు కనిపించేడు" అన్న తృప్తిని మిగిల్చేడు. నిన్నటి రాక. ఇవాళిటి పోక. ఈ మధ్యకాలంలో మా అనుభవం ఓ జీవితం బస్....జీవితమే ఒక నాటక రంగం! అయితే ఈ నాటకంలో సుశీల ప్రవేశించి నాకు పరిచయం కావడం ఒక అద్భుతం!

సుశీల-అసలావిణ్ణి తల్చుకుంటేనే మనసు అదో రకమైన అందోళనకి గురవుతుంది. నిర్దాక్షిణ్యంగా ఒక స్త్రీ అభిమతాన్ని నిరా

కరించ వలసొచ్చిందే అనే బాధా కలుగుతుంది. కేవలం ఒక ఆడది అని కాదుగాని ఆ మాటకొస్తే నా మూలంగా ఎవరు ఏ రకంగా బాధపడుతున్నారన్నా–ఆ బాధకి ఏమాత్రం నేను కారకుణ్ని కాకున్నా–ఎంతో బాధపడిపోతాను నేను. నిజానికి అదీ ఓ మానసిక బలహీనతే అయినా నాలో నాతోబాటు ఎదుగుతూ వొచ్చిన ఆ వీక్నెస్ని ఎంత ప్రయత్నించినా నేనిక వదులుకోలేను.

ఇంతకీ సుశీల నాకు స్నేహితురాలు కాదు. కనీసం క్లాస్మేటయినా కాదు. మాకు రెండేళ్ళు జూనియర్. అంటే కాలేజ్మేట్ అనొచ్చు నేమో! ఎప్పుడో లైబ్రరీలోనో, లేక ఫంక్షన్స్లోనయినా జరుతున్నపుడో బహుశా చూచి వుంటానేమో ఆమెని. ఆమె రూపం అట్టే గుర్తు కూడా లేదు నాకు అప్పటికి.

అల్లాంటి ఆవిడనుంచి హఠాత్తుగా నాకో రోజున వుత్తరం వొచ్చింది. పరిచయం లేని దస్తూరీని చూసి మొదటే విస్తుపోతూ కవర్ని చించిన నేను మరింత విస్తుపోయేను ఆ వుత్తరాన్ని చదివి.

నాలుగైదు వాక్యాల్లో నా గుణగణాల్ని కీర్తించి, తన కళ్ళతో చూచినంతవరకూ నా ఆకారాన్ని వర్ణించి ఆఖరున ఓ ప్రతిపాదన చేసింది–సుశీల–"మీరంటే ఇష్టం. పెళ్ళి చేసుకుందాం మీకిష్టమైతే" అని.

ఒకటి రెండు క్షణాలు.... నిమిషాలు అల్లాగే వుండిపోయేను ఆ వాక్యం చదివి. ఆపైన తిన్నగా ఆ విభ్రాంతి నుంచి తేరుకుని, నన్ను నేను సమాధాన పరుచుకుని నాకు తెలిసినంతలో సుశీల ఆకారాన్నీ, అంతరంగాన్ని వూహించసాగేను. అయినా లాభం లేకపోయింది.

అప్పటికి నా వుద్యోగ యత్నాలు ముమ్మరంగా సాగుతోన్న రోజుల్లోనే

ఆ అభిప్రాయం తొలుత ఎవరికి కలిగిందో తెలియదు గాని

"గుంటూరుకి అప్లయ్ చేసేనే ఆమధ్య–ఇంటర్వ్యూకి రమ్మని కబురొచ్చింది. వెళ్ళాలి నాలుగో తారీఖున" అని డైనింగ్ టేబుల్ ముందు నాన్నగారితో నేనంటే

"ఆ వూళ్లోనే వున్నాడురోయ్ మన ప్రభాకరం. నీకు మామయ్యవుతాడు. ముందుగా నువ్వెళ్లి వాణ్ని కలుసుకో" అని ఆయన అనడమూ,

"వాళ్ళకో అమ్మాయుండాలండోయ్... పేరు అరుణ. ఎప్పుడో గౌన్లు తొడుక్కునేప్పుడు చూసేను ఆ పిల్లని. ఎంత బావుండేదో అంతప్పుడే"

అని లోలోన సంబరపడిపోతూ అమ్మ మరో ఆచూకీ అందించడమూ

ఆ ఇద్దరి మాటల సారాంశం–అరుణ అని అని నేను తెలుసుకున్నానని

అటు వాళ్లకీ తెలిసింది ఇటు నాకూ తెలిసిపోయింది.

అమ్మ అడిగింది "అయితే రేపే బయల్దేరవూ?–రోజు బావుంది"

ఆ 'రోజు బావుండడం' నాకు వుద్యోగం రావడానికో– తనకి కోడలుపిల్ల రావడానికో నేనూహించలేననుకుంది అమ్మ.

ఆ మరునాడే నేను సూట్కేస్ సర్దుకుని "వెళ్లొస్తా"నని బయలు దేరుతుంటే

"ఉత్త చేతులతో వెళ్లేవు వాళ్లింటికి–పూలూ పళ్ళూ పట్టుకెళ్లు" అని చీరకొంగు ముడివిప్పి ఓ పదిరూపాయలనోటు అదనంగా నా జేబులో వుంచుతూ "అందర్నీ అడిగేనని చెప్పు. వీలయితే సెలవులకి రమ్మను–చాలా ఏళ్ళయింది చూసి" అంటూ మనసుతోనే నన్నేమని దీవించి పంపిందో అమ్మ!

గుంటూర్లో అటు బస్సు దిగి, ఆటో చేయించుకుని నాన్నగారు రాసిచ్చిన వీధి పేరు, ఇంటి నెంబరు మరోమారు తీసి చూసే అవసరంలేక మనసులోనే బాగా గుర్తుండి ఆటో డ్రయివర్కి చెప్పి అతను దించిన ఓ ఇంటిముందు సూట్కేస్తో నిలిచి, కాంపౌండ్ గేట్ని తెరుచుకుని, పూలచెట్ల పెంపకంలో మామయ్యకున్న



శ్రద్ధని, అభిరుచిని మెచ్చుకుంటూ వరండాలో నుంచుని అక్కడినుంచి ఎదురుగా కనబడుతోన్న కిటికీలోంచి లోపలి గదిలోని నా చూపుల్ని పోనిచ్చి

సన్నగా రేడియోలోంచి వినవస్తోన్న హిందీపాటల్ని వింటూ వాలుకుర్చీలో పడుకుని, పొడవాటి నల్లని జడని ముందుకి తీసి గుండెలమీద వొదులుకుని, తామర తూడుల్లాంటి చేతివేళ్ళతో అతి సున్నితంగా పట్టుకున్న పుస్తకంలోని పేజీని అప్పటికప్పుడే తిప్పుతూ కంటిరెప్పల తుమ్మెదల్ని కళ్ళు కలువలమీద రెపరెపలాడిస్తోన్న అరుణని చూసేను నేను.

ఒక్క పొడిదగ్గుతో నిన్ను చూసిన వెనక నా గొంతుక మూగవోయిందన్నట్టు నేనొచ్చేను నీ కోసమని నా వునికిని తెలియజేసేను నన్ను చూసి క్షణం కలవరపడి, అటు తిరిగివొచ్చి "ఎవరు కావాలండీ?" అని అడిగిన అరుణకి 'నువ్వేనే' అని చెప్పబోయి అంతలోనే బనీను తొడుక్కుంటూ అటుగా వొచ్చిన మామయ్యని చూసి ఆగిపోయేను.

ఆయన మరింత దగ్గరగా వొచ్చి, నన్ను గుర్తించి "ఓరి పిడుగా! నువ్వట్రా రా....రా! అనుకుంటూనే వున్నా ఇవాళో రేపో వొస్తావని" అని నన్ను చెయ్యిపట్టుకు నడిపించి తీసికెళ్ళేడు లోపలికి.

"ఏమేవ్ అల్లుడొచ్చేడు" కేకేసి పిలిచేడు అత్తమ్మని.

ఆమె "ఎవరూ సుందరమా?" అంటూ వొచ్చి నా చేతిలోని సూట్ కేస్ తీసి బల్లమీదుంచి నన్నూ, మామయ్యనీ మార్చి మార్చి చూసి "అప్పుడనగా సీత మొన్నదిన పెళ్ళిలో చూసేను బాబూ! నిన్ను దాంతో. ఇంతవాడివయ్యేక కనబడుతున్నావు మళ్ళీ. అంతేగా ఊళ్ళు దూరమైతే బంధుత్వాలూ దూరమౌతాయిట. ఇంట్లో అమ్మా నాన్నా కులాసా?" అని అడిగింది ఎంతో ఆప్యాయంగా.

"బావున్నా రత్తమ్మా! అమ్మ మిమ్మల్నందరనీ అడిగినట్టు చెప్పమంది. సెలవులకి తప్పకుండా రమ్మంది." అన్నాను నేనూ.

ఈ మాటల మధ్యలో చదువుతోన్న పుస్తకాన్ని అక్కడే వదేసి ఎప్పుడు తుర్రుమందో అరుణ లోపలికి. ఆ కనిపించడం కనిపించడం మళ్ళీ భోజనాల దగ్గరే.

అరుణ ఇంటర్ ప్యాసయింది–ట! ఆ పైన చదవనందిట.

ఓ ఆడపిల్ల ఎదిగి కూచుని ఇక నేను చదవనంటే అందులో వున్న అర్థమేమిటో అత్తమ్మ మామయ్యలు తెలుసుకున్న సమయానికే నేను వాళ్ళకి చేరువయ్యేను.

ఆ సాయంత్రం ఇంట్లో అందరూ తీరిగ్గా కూచుని కబుర్లాడుకునే సమయంలో ప్రస్తావించేరు మామయ్య నా ఉద్యోగం గురించి,

"ఇంత మంచి క్వాలిఫికేషనూ, మెరిట్ వుండీ కూడా చచ్చు ఆ క్లర్కుగిరికి దేవిరించడం ఏమిటి? కాస్త నిదానించు—కాలేజీలో ఏవైనా వేకన్సీస్ వున్నాయేమో కనుక్కుంటాను" అన్నారాయన.


రైల్వేలో ర్యాంక్ వుద్యోగం మామయ్యది.

అత్తయ్య పుట్టి పెరిగింది కేరళలోనే అయినా కాలేజీలో మామయ్యని ప్రేమించి, పెళ్ళాడి, తెలుగింటి కోడలై విమెన్స్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా వుంటూ కూడా ఎంచక్కా మాట్లాడగలదు తెలుగు. ఆమె నోటంట తెలుగు వినడం అదో సంగీత విభావరి!

వాళ్ళ మంచి తనం, పరపతీ చూసేక నాకూ కొంత నమ్మకం కలిగింది వుద్యోగం మీద.

నా వూహాలు క్లర్క్‌గిరినుంచి లెక్చరర్ వరకు ఎల్లాగయితే వెళ్ళేయో అల్లాగా నా చూపులు అత్తమ్మ మామయ్యల నుంచి అరుణ మీదికి వెళ్ళేయి. అందమే ఆడదయితే అరుణలా వుంటుందని నా కళ్లు సాక్ష్యం ఇస్తాయి.

ఆ మేలిమి బంగారానికి అద్దిన మరో సువాసన తియ్యని గొంతుక.




టేప్‌లో విన్నాను అరుణ కంఠాన్ని, "చాలు ఈ జీవితం ధన్యమైంది" అనుకున్నాను.

అమ్మానాన్నల ఆశ, అత్తమ్మ మామయ్యల ఆశంస మేమిద్దరూ ఏకం కావడం. అందుకు తగిన అంగీకారాన్ని ఆ మొదటిసారే నాతో మాట్లాడిన అరుణ పెదాల చిరునవ్వుల్లోనూ,

ఇంటికి ప్రయాణమై సూట్‌కేస్ పట్టుకుని "ఇక వెళ్లొస్తా" నన్నపుడు ఆమె దిగులు చూపుల మబ్బుల్లోనూ నేను చూడగలిగేను....

అలా అరుణ అందాన్ని నా కళ్ళలో నింపుకుని, అంతటి అదృష్టాన్నీ నా భవిష్యత్తులోకి వొంపుకుని ఆ వూహాల మత్తులో నేను పూర్తిగా మునిగితేలే సమయంలోనే నా కలా వుత్తరాల్లో తారసపడింది సుశీల.

కలల్లో అరుణ! ఉత్తరాల్లో మాత్రమే సుశీల!

ఆ ఇద్దరిలోను సహజంగానే నా మనసెవరివేపు మొగ్గు చూపుతుందో నేనిక వేరుగా చెప్పనవసరం లేదు. అందుకనే నా అభిప్రాయం కోసం ఎదురు చూస్తుంటానన్న ఆమె ఉత్తరానికి బదులివ్వలేదు.

అదే అభియోగాన్ని మోపుతూ మరో వారానికల్లా ఇంకో వుత్తరం రాసింది సుశీల. అల్లాగే మరో నాలుగయిదు వుత్తరాలు వెంట వెంటనే.

ఇక చేసేదిలేక, ఆమె మనసుని నొప్పించడం ఎప్పటికో ఒకప్పటికి ఎల్లాగూ తప్పదని అనిపించేక ఆ అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తూ ఆమె కోరికని కాదంటున్నందుకు- కాదనవలసిన పరిస్థితి నాకప్పటికే ఏర్పడినందుకు-సంజాయిషీ చెప్పుకుంటూ రాసేనో వుత్తరం.

ఆ వుత్తరం రాసిన పది రోజుల కనుకుంటాను "ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిలో పేరు రిజిస్టర్ చేయించాలి నువ్వు రా సర్టిఫికెట్లతో" అని మామయ్య రాస్తే వెళ్ళేను గుంటూరుకి. అక్కడ నా పేరు రిజిస్టర్ చేయించడమే కాదు - అప్పటికి లెక్చరర్ పోస్టొకటి ఖాళీగా వున్న కాలేజీకి అప్లికేషనూ పడేసేను. అంతమాత్రమే కాకుండా అది ముఖ్యంగా అరుణలోని నా జ్ఞాపకాన్ని రెన్యూవల్ చేసుకుని మరీ తిరిగొచ్చేను ఇంటికి.

వీధి వాకిలి తీసుకుని నా గదిలోకి వెళ్లి ప్రయాణపు బడలిక తీరేట్టు మార్చుకుంటున్నాను బట్టల్ని. అంతలోనే అమ్మ వచ్చిందక్కడికి. ఒకటి రెండు మాటల్లో మామ

య్యల క్షేమాలని పరామర్శించి "ఎవరో అమ్మాయొచ్చింది-నీ కోసం-సుశీలట!"

అవాక్కయ్యేను నేను. మళ్ళీ నోరు తెరిచి నే మాట్లాడే లోపునే అంది అమ్మ "తనేమో వెళతానంది నిన్ననే. కాని నేనే నిలిపేను ఇవాళ నువ్వొస్తావని. అదిగో ఆ వంటింట్లో వుంది. రా! కాఫీ తీసుకుందువు"

లుంగీ కట్టుకుని, బనీనుపైన భుజాల మీదుగా టవల్ కప్పుకుని అనుసరించేను అమ్మని. నా గదినుంచి వంటింటికి నడిచిన ఆ అరనిమిషంలోనే ఎన్నెన్నో విధాలుగా సుశీల రూపాన్ని వూహిస్తూ ఆ గదిలోకి వెళ్లి, అమ్మ కూచునే పీటమీదకూచుని ఉల్లిపాయల్ని ముక్కలుగా తరిగి పెడుతోన్న సుశీలను చూసినప్పుడు నేను కొంత ఆశ్చర్యాన్ని, సంతృప్తిని పొందిన మాట వాస్తవమే.

ఎందుకంటే ఓ మామూలుపాటి అందాన్నే ఎదురు చూసేను నేను సుశీలలో అంతకు ముందు కాని ఆమె ఓ పిసినిగొట్టు ఎగ్జామినర్ చేతికి ఇంటెలిజెంట్ అయిన విద్యార్థి తాలూకు ఆన్సర్ షీట్ తగిలినట్టే కనిపించింది నా కంటికి. అయినా ఆమెని చూచి "బాగానే వుంది" అనుకున్నాను మనసులో.

అరుణనే నా కళ్ళతో నా దాన్నిగా అదివరకే నేను చూచి వుండనట్టయితే "చాలా బావుంది సుశీల" అనుకునే వాణ్నేమో!— చెప్పలేను.

"సారీ! మీరొచ్చే సమయానికి నేనూళ్లో లేను" అంటూ కూచున్నాను కుర్చీలో.

అమ్మ కాఫీ కలిపి ఇచ్చింది.

సుశీల ఏమని ఫీలవుతోందో మనసులో ఏ మాటా పలకలేదు. ఊరికే తల ఎత్తి ఒకే మారు నా కళ్ళలోకి నిలువునా చూసి మళ్ళీ దించేసుకుంది తలని.

"ఎక్కడయినా ప్రయత్నం చేస్తున్నారా వుద్యోగానికి?" అడిగేను ఆమెను చూస్తూ, కాఫీ తాగుతూ,

"లేదు" అని చెప్పలేదు ఆవిడ నోటితో తల అడ్డుగా వూపింది అదే అర్థంతో.

"జస్ట్ ఫైవ్ మినిట్స్! తర్వాత మాట్లాడుకుందాం" గ్లాసుని టేబుల్ మీద వుంచుతూ ఆమెతో అని నడిచేను బాత్ రూం వేపు.


స్నానం ముగించి, పొడిబట్టల్లో తెల్లని మబ్బు తునకలా తయారయి సుశీల మళ్ళీ ఆ పెళ్ళిప్రసక్తిని తీసుకొస్తే అప్పుడు ఆవిడకేమని సమాధానం చెప్పాలో, ఎల్లా సముదాయించాలో, నా మనసిదివరకే మరొకరిపై వుందని అంత ఖచ్చితంగా ఆమెతోనే అంటే అప్పటి సిచుయేషన్ ఎల్లా వుంటుందో అనే మీమాంసలో మునిగి 'ఏమయితే అయిందిలే' అనే నిర్ణయంతో అడుగు పెట్టేను నా గదిలో.

ఆ సమయానికే తను తెచ్చుకున్న బట్టల్ని చక్కగా మడతలుపెట్టి బ్యాగ్ లోకి సర్దుకుంటోంది సుశీల. చూడగానే అది ప్రయాణ సన్నాహంలా అనిపించి అడిగేను ఆవిణ్ని "ఏమండీ! అప్పుడే వెళుతున్నారా?"

ఆమె తలయెత్తి మునుపటిలాగానే నావేపోసారి ఆ సూదికళ్ళ చూపులతోనే చూసి మళ్ళీ మామూలుగా తన పని తాను కొనసాగించింది. సర్దిన బ్యాగ్‌ని మంచం కిందికి జరిపి స్టాండ్‌ని వున్న అద్దంలో మొహాన్ని చూసుకుంటూ తలని పైపైనే దువ్వుకోసాగింది.

నేను ఆమె వాలకం చూసి అమ్మ కూడా ఏదో ఈవిడకి అరుణని గురించి చెప్పివుంటుందన్న అనుమానమూ, ఇక ఎంత చెప్పినా ఈవిడ తన ప్రయాణం మానుకునేట్టు లేదన్న నిశ్చయమూ కలిగి ఆమె నాకు కనిపించే ఆ ఆఖరి నిమిషాల్లోనయినా కొంత ఫ్రెండ్లీగా మాట్లాడి అనునయిద్దామన్న సదుద్దేశంతో ఏదో పెదవి కదప బోయేంతలోనే వొచ్చింది అమ్మ అక్కడికి.

"ఇదిగోమ్మాయ్! పూలు.... తల్లో పెట్టుకో" అంటూ ఒత్తుగా చెండులా చేర్చి




కట్టిన సన్నజాజుల్ని స్టాండు మీదుంచి వెళ్ళింది.

సుశీల తల దువ్వుకుని, భరిణలోంచి కుంకుమ తీసి అతి జాగ్రత్తగా గుండ్రంగా తీర్చిదిద్దుకుంది నుదుటన. ఆ చేతికయిన కుంకుమని తన రంగుల ఓణీ చివర్లకి తుడిచేసి అందుకుంది పువ్వుల్ని. తల వొంచుకుని సిగలో వాటిని తురుముకుంటూ అడిగింది నన్ను సుశీల "అడవిమల్లె అంటే అర్థం—ఎందుకూ కొరగానిదనేగా?"

పెదవి విప్పి ఆమె నాతో పలికిన మొదటి మాట అది. విని కలవర పడ్డాను. సమయమూ సందర్భమూ లేని ఈ మాటని అడుగుతోందేమిటి ఈవిడ? ఆలోచించేను అప్పుడు నాకు గుర్తొచ్చింది—ఆవిడ రాసిన అన్ని వుత్తరాలకీ బదులుగా, చివరగా నేను రాసిన వుత్తరం.

అందులో నా పరిస్థితుల నన్నింటినీ తేటతెల్లం చేస్తూ ఆఖరున నే చేసిన ఒకే ఒక్క పొరపాటు—ఓదార్పుగా ఓ వాక్యం రాయడం—

"కలకాలం నా మనసులో అడవి మల్లెలా నిలిచిపోతావు సుశీలా!" అని.

అంతలా జ్ఞాపకం వుంచుకుని ఆ రెఫ రెన్సునే నా కిప్పుడు కలిగిస్తోంది సుశీల.

నేనన్నాను నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోడాని కన్నట్టు "అడవి మల్లె అంటేనే స్వచ్ఛతకి మరో పేరు. నిష్కల్మష త్వానికీ, నిసర్గ సౌందర్యానికీ అదో సంకేతం"

నా మాట పూర్తి కావడం తరువాయి అమ్మ వొచ్చింది పళ్ళెం ఒకటి చేత బట్టుకుని, చీరా జాకెట్ పీసూ, ఆకూవక్కా, పసుపూ కుంకం, అప్పుడే చెట్లోంచి దూసిన సన్న జాజి మొగ్గలు కొన్ని.

లోపలికొస్తూనే "అమ్మాయ్! ఇల్లా వొచ్చి కూచో" అంది అమ్మ కుర్చీముందు నుంచుని.

సుశీల తల్లి మొహంవేసి చూస్తూ "ఏమిటండీ! నాకెందుకివి?" అని అడుగుతూ ఆ పురమాయింపుని కాదన లేక వెళ్ళి కూచుంది కుర్చీలో. అమ్మ కుంకుమ తీసి ఆమె తీర్చుకున్న బొట్టుపైనే తేలిగ్గా అద్ది "మాకా కూతుళ్ళులేరు. ఉన్నదవీడొక్కగానొక్క కొడుకు. ఏదో నువ్వొచ్చేవు... మా ముచ్చట కొద్దీ ఇది" అంటూ పళ్ళెన్ని అందించింది.

సుశీల దాన్ని తీసి పక్కన వుంచి

అమాంతం అమ్మ కాళ్ళకి వొంగి నమస్కరించింది. ఆ చర్యకి చలిస్తూ అమ్మ ఆమె భుజాల్ని పట్టి ఆప్యాయంగా లేవనెత్తింది. ఆ ఊపులో సుశీల కళ్ళలోంచి జారిన కన్నీటి బొట్లు పచ్చని అమ్మ పాదాల మీద పల పల రాలేయి.

"ఎందుకే పిచ్చిపిల్లా!" అంటూ సుశీలని కావిలించుకుంది అమ్మ.

"నీలాంటి దాన్ని కోడల్నిగా చేసుకోలేకపోవడం మా దురదృష్టం. నీ కెందుకే బెంగ. ఆ వుద్యోగం కాస్తా వొచ్చి నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలిగితే నీకేం తక్కువ?"

అంత వరకూ సుశీల ఏ ప్రయోజనం కోసమై మా ఇంటి గడప తొక్కిందో ఆ అసలు సంగతి అమ్మకి తెలియదనే అనుకుంటున్నాన్నేను. కాని అమ్మ నోటంట ఆ మాటని వినగానే ఆమెకి ఆ సంగతి తెలుసని తెలుసుకున్నాను. మొదట అరుణ విషయం తానై ప్రపోజ్ చేసి ఇప్పుడీ సుశీల ఇల్లా కళ్ళబడగానే ఈవిడ్ని కోడలిగా చేసుకోలేక పోయేననే ఆవిడ ఆడమనసునీ అర్థం చేసుకున్నాను. ఎటొచ్చీ అమ్మ ఇలాంటి విషయాన్ని నాన్నగారి చెవి వరకూ పోనివ్వదన్న నమ్మకం నాకున్నా "ఆయనేమంటారో తెలిస్తే" అనే అనుమానంతో తప్పుచేసిన వాడిలా—తప్పునాది కాకున్నా—అనవసరంగానే ఫీలయ్యేను. అక్కడ నిలవలేక పోయేను.

అమ్మ అంటోంది "ఇవాలిటకుండు సుశీలా! రేపటికెళుదువుగాని"

కాని వినిపించుకున్నట్టు లేదు సుశీల. బ్యాగ్ తీసుకుని బయటపడింది. వీధి వాకిలి దగ్గర నుంచున్న నాతో అంది "వెళతాను"

ఇటువేపు అమ్మ వుంది మా ఇద్దరినీ చూస్తూ, నాకేం చెప్పాలో తోచలేదు.

"వెళతాను కాదు. వెళ్లొస్తాననాలి" అనబోయి అంతలో అలా అనబోవడం—నా నుంచి తిరస్కరింప బడిన సుశీలతో—నాకే ఎబ్బెట్టుగా అనిపించి తల వూపేను మౌనంగా-వెళ్ళమన్నట్టు-వెళ్ళి రమ్మనట్టు!

ఆమె వెళ్లింది. వెళ్లిపోయింది — మా ఇంటినుంచి-క్రమంగా నా మనసున ఆమె వల్ల కలిగిన కల్లోలంలోంచి....

ఈ లోపున మా మయ్యా రమ్మని రాసేసు ఇంటర్‌వ్యూ వుందని నేను వెళ్లడం, సెలెక్ట్ కావడం, వుద్యోగం రావడం, నేను గుంటూరుకే మామ యింటికే మకాం మార్చడం— ఆ గడచిన రోజులు, వారాలు, నెలలు అన్నీ క్షణాల్లాగే అనిపించేయి నాకు అందులోనూ అరుణతో నా పెళ్లి రోజు దగ్గరయేకొద్దీ కాలమంతా వూహల్లోనే కరిగిపోసాగింది.

ఇక మా పెళ్లికి ఓ పదిహేను రోజులుందనగా స్నేహితులందరికీ శుభలేఖలు పంపుతూ ప్రత్యేకంగా ఒక వుత్తరమూ రాసేను—ఎట్టి పరిస్థితుల్లోనూ అకేషన్‌కి మిస్ చెయ్యొద్దనీ, ఎవరు రాకున్నా, నేను చాలా డిసప్పాయింట్ అవుతాననీ.

అల్లాగే సుశీలకీనూ. అయినా ఆమెకి రాస్తున్నపుడు మాత్రం చాలా ఘోషకి గురయ్యేను నేను. మొదట ఏమనుకుంటుందో ఏమోనని పంపకపోవడమే మంచిదనుకున్నాను. అయినా ఆమెని కాదని త్యజించినపుడే లేని ఔదార్యం ఇపుడు మాత్రం ఎందుకులెమ్మని పంపేను. ఉత్తరమూ రాసేను చాలా మామూలుగా-జాగ్రత్తగా.

పెళ్లి మా వూళ్లోనే పెట్టుకున్నాము. విశాలమైన వీధి నిండుగా పచ్చని పందిళ్లు. ముంచెత్తే దీపాల వెలుగు. చుట్టాల రాక. అప్పుల పలకరింపులు. స్నేహితుల అస్నేళ్ల విరహం తర్వాతి తీపి కలయిక. బోలెడంత సందడి. సంతోషం వెల్లువ. ఊహాల పడవ. భవిష్యత్తీరాలకేసి ప్రేయసి కన్నుల వెన్నెల్లో పయనం.

ఇతరుల పెళ్ళిళ్ళనే ఎంతో బాగా ఎంజాయ్ చేసే నేను తీరా ఆ పెళ్లి నాకే అయినప్పుడు ఇంకెంతగా ఆనందిస్తాను!

అయినా అంతటి ఆనందంలోనూ నా మనస్సు కలుక్కుమనడం ఒక్క సుశీల జ్ఞాపకంతోనే. ఎందువల్ల ఆమె రాలేదన్న అనుమానంతోనే. అందుకు తగ్గట్టే తక్కిన ఫ్రెండ్స్ అందరూ వొచ్చినా మావాడూ – సుబ్బారావు—రాలేదు ఎంతకీ.

రాడేమో అన్న గుబులు "వెధవ! రాలేదే ఇంకా" అనే కోపం.

అంతమంది బంధువుల ఎదుట కళ్యాణ మంటపం కిందట పురోహితుడు పలికే శ్లోకాలనే పలుకుతూ నా పక్కన వెన్నెల కుప్పలా మునుపెన్నడూ లేనంత అందంగా, సిగ్గుతో మురిపెంగా, ముద్దుగా కూచున్న అరుణని కనకొసల్లోంచి చూస్తున్నప్పుడెంత ఆనందం!

ఎదురుగా వాకిలికేసి 'ఇప్పటికయినా వొస్తాడేమో సుబ్బారావు' అని ఆశగా చూస్తున్నప్పుడెంత ఆరాటం?

సుశీల రాదే! ఏమయింది? వుద్యోగం వొచ్చిందా? ఊరు మారిందా? ఎవరినయినా పెళ్లాడిందా? అని ఆలోచిస్తున్నప్పుడెంత ఆందోళన!

తీరా ఆ అందరి చూపుల మధ్య, హోమంలో వేసిన నేతి సువాసనలమధ్య, నాతిచరామి వాగ్దానాలమధ్య, పీటలమీద కూర్చున్న మా కన్నుల కలయికలమధ్య మాంగల్యధారణ జరుగుతోండగా

ఆ హోమం పొగల సెగలు కమ్మిన కళ్లతో ద్వారంవేపు చూస్తే.

"మీలా పైలా పచ్చీసు కాదోచ్. నేనో బిజీ అయిన బిజినెస్ స్టార్"ని అన్నట్టుగా అపుడే రంచనుగా దిగేడు సుబ్బారావు.

ఆ వేళకి నా కొంగు అరుణ కొంగుతో ముడేసివుండబట్టి సరిపోయిందిగాని లేదంటే వున్నఫళంగా వెళ్లి వాని బుగ్గలు బూరెల్లో వుబ్బేట్టు ఎడాపెడా వాయించేవాణ్ణే!

ఏమయితేనేం? మూడు ముళ్ళూ వేసే సమయానికే ముహూర్తంలా వొచ్చేడు వీడు. చాలనుకున్నాను.

మాంగల్య ధారణ జరిగింది. మంటపానికి ప్రదక్షిణలూ అయ్యేయి.

కలిసి ఏడడుగులు నడవమంటే పురోహితుడు "నేనూ అరుణా కలిసి ఇప్పటికే ఎన్నివేలడుగులు నడిచేమో నీకేం తెలుసు వెర్రిమొహమా!" అనుకుంటూ ఆ ఏడడుగులూ నడిచేను అరుణతో.

ఆపైన ద్వారందగ్గర పేర్లు చెప్పమని అటకాయింపు పదిమందిలోనూ నా పేరుని పలకలేక సిగ్గుతో తల వాల్చేసుకున్న అరుణమీద వరసైన ఆడ బిడ్డల విసుర్లు, సాధింపులు, అది గడిచి లోపలికెళ్లేక పాలు పండూ చూపుల కవ్వింపులకి మళ్లే సగం సగం ఆరగింపులు.

అయ్యేక "విప్పకూడదు ఇప్పుడే" అని సాధించే అత్తమ్మల్ని బతిమాలి,

"ఫ్రెండ్ అరుణా! వొచ్చేస్తాంగా" అని ఆమె తల్లోని పువ్వులు తగులుతోండగా చెవిలో చెప్పి,

పందిటి కిందికి చేర అప్పటికే సిగరెట్ సేవనల్లోకి దిగిన ఫ్రెండ్స్ మధ్య వెదికి పట్టుకున్నాను సుబ్బారావుని.

ఏదో పని వున్నట్టు వాణ్ణి పక్కకి లాక్కెళ్లి "ఇంత ఆలస్యంగానా రావడం?" అని చరుస్తూ అడిగేను వాణ్ణి. ఆత్రుత చంపుకోలేక "సుశీలకి వెడ్డింగ్ పంపేను. ఆవిడ రాలేదు. నాకోసం ఆవిడ వివరాలని కనుక్కుంటానన్న వెధవ్వి నీకు తెలుసా... ఎక్కడుంది సుశీల?"

నావైపు అదోలా చూసేడు సుబ్బారావు.

"నా ఆలస్యానికీ ఆవిడే కారణం. మనసు బావుండలేదు" చెప్పేడు.

అప్పుడు గమనించేను వాణ్ణి. నలిగిన బట్టలు, చెదిరిన క్రాపు

ప్రయాణపు బడలికే కాదు — ఏదో చేజారిన దైన్యం!

"విషయమేమిటి? ఊళ్లో నేనా ఆమె వుండడం?" అడిగేను.

"పసుబ్బట్టల్లో వున్నావు నీకెందుకీ వార్త చెప్పడం?" తటపటాయించేడు.

"ఫరవాలేదులే ఏమైందో చెప్పరా చంపక" గట్టిగా వాడి చేతులు పట్టుకున్నాను.

"సూసైడ్ చేసుకుంది సుశీల"

నా ఒళ్లు చప్పున చల్లనయింది నాలో ఏదో భయం ఆవరించింది.

"నీకెల్లా తెలుసు? చూసేవా నువ్వు?" అడిగేను వాడు విన్నదో, చూసిందో అబద్ధం కావచ్చునన్న భ్రమతో.

"నిన్న సాయంకాలమే నేనిక్కడికి రావాలని బయలుదేరుతోండగా మా వీధిలోనే ఓ హాస్పిటల్ ముందు జనం గుంపు కూడితే ఏమిటో అని వెళ్లిందిట మా అక్క. వెళ్ళిన అరగంటకి తిరిగొచ్చింది.

"పాపం.... పెళ్ళి కావలసిన పిల్ల. బాగా చదువుకోసూ చదువుకుంది. అదేం ప్రారబ్ధమో నిద్ర మాత్రలు మింగింది. కొన ప్రాణం ఇక్కడికొచ్చేక గాల్లో కలిసింది. ఇక్కడికి కొంత దూరంలోనే ఏదో పల్లెట ఆ అమ్మాయిది"

అంతా అయి చేతికి సూట్ కేస్ అందుకోబోతుం మా ఆవిడతో అంటోన్న ఆవిడ మాటలు విని ఎందుకో అనుమానం వొచ్చి వెళ్లేను హాస్పిటల్ కి. రద్దీగా వున్న జనంలోంచి దారి చేసుకుని వెళ్లి చూస్తే ఈ సుశీల! గుండె ఆగినట్టయింది ఆ క్షణం. అయినా ఏం చెయ్యను? ఊరికే ఆమెని చూసి ఎవరో ఎరగనివాడిలా ఏం చెబితే ఏ అనర్థం ముంచుకొస్తుందో అన్న అనుమానంతో వొచ్చేసేను ఇంటికి. ఆ మధ్య నువ్వో మీ ఇంటికొచ్చినప్పుడు చెప్పేవు ఆమెని గురించి. అందుకని నేనూ కొంత విచారిస్తే తెలిసిన విషయం— పెళ్ళి పట్ల నీ ఉద్దేశం వేరుగా వుండడం గ్రహించి నీకు తెలపలేదు — సుశీలకెవరూ నా అన్న వాళ్ళు లేరట... ఒక్క అమ్మ తప్ప. అన్నయ్యొకడున్నా వాడు లేనట్టే లెక్క. జులాయి తిరుగుళ్లు తిరుగుతూ ఇంటి విషయాలేవీ అస్సలు పట్టించుకోడట. అందులోనూ ఈమధ్యే వాళ్లమ్మకీ జబ్బుచేసి హాస్పిటల్లో చేర్పిస్తే ఓ నెలనాళ్ళకి ఆ బెడ్ మీద వుండే పోయిందట ఆమెకూడా. అంతో ఇంతో అంగబలంతో బాటుగా అర్థబలమూ వున్న మనలాంటివాళ్లమే వుద్యోగాలు సంపాయించుకుని మన కాళ్లమీద మనం నిలబడలేని ఈ రోజుల్లో ఒక ఆడపిల్ల - అందునా ఒంటరిది - ఎలా బ్రతగ్గలదు? అంచేత ఏవో సంస్కారణలని, ఆదర్శాలని అంటూ వుంటావనీ, నువ్వయినా ఆమని అర్థం చేసుకుని ఆదరించగలవనీ, తనకింత నీడ నివ్వగలవనీ నీకిలా వుత్తరం రాసింది. నీనుంచీ ఆ ఆశా ముక్కలయి తిరస్కారమే ఎదురయితే అప్పుడిక చేసేది లేక చావులోనే తన సమస్యకి శాశ్వత పరిష్కారాన్ని ఎన్నుకుంది"

ఆత్మహత్యలతో ముగిసే కథలంటేనే అంతగా సుముఖత వుండేది కాదు నాకు సహజంగా. జీవితంలోనే అల్లాంటి సన్నివేశాన్ని ఎదుర్కొన్నాను నేనిప్పుడు — ఏమనుకోను? "సుశీల గురించి ఏమయినా తెలిసిందా తర్వాత?" అని అడిగితే అమ్మకి సమాధానం ఏమని చెప్పను? అందునా ఆవిడ ఆత్మహత్యకి పరోక్షంగా కొంతలో కొంత కారణభూతుణ్ణయిన నేను! ★